# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 27, అక్టోబరు, 2014

58 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతం నదీ జలాల కేటయింపు, వినియోగం విషయంలో పూర్తిగా అన్యాయానికి, వివక్షకు గురయిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆంధ్ర జల దోపిడిని అరికట్టి తెలంగాణకు న్యాయం చేయాలని కోరారు. కృష్ణా రివర్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఎస్.కె.జి.పండిట్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో సమావేశమయ్యారు. నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు ఆర్.విద్యాసాగర్ రావు, బివి.పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, నీటి పారుదల శాఖ కార్యదర్శి ఎస్‌కె.జోషి, జెన్‌కో సిఎండి ప్రభాకర్ రావు, నీటిపారుదల శాఖ సిఇ మురళీధర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కృష్ణా నదిపై నిర్మించిన మొదటి ప్రాజెక్టు నాగార్జున సాగర్ నుండి మొదలు కొని పోతిరెడ్డిపాడు వరకు తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ ప్రజలు అనన్య త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని, ఆంధ్ర పాలకులు అడ్డు పడినా జాతీయ రాజకీయ యంత్రాంగాన్ని ఒప్పించి రాష్ట్రం సాధించుకున్నామని చెప్పారు. అందుకే చంద్రబాబు తెలంగాణపై కక్ష ఉందని, తెలంగాణ రాష్ట్రం విఫలమయిందని చెప్పడమే చంద్రబాబు లక్ష్యంగా మారిందని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే తెలంగాణకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నాడని, నీటి విషయంలో, కరెంట్ విషయంలో నిబంధనలన్నీ ఉల్లంఘిస్తున్నాడని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు 54 శాతం కరెంట్ రావాల్సి ఉంటే దానిని అడ్డుకున్నాడని వెల్లడించారు. సీలేరు నుంచి తెలంగాణకు కరెంట్ ఇవ్వడం లేదని, ఈ విషయంలో సదరన్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు. గోదావరి రివర్ బోర్డు, సెంట్రల్ ఎలక్ట్రిసిటి అథారిటీ చెప్పినా చంద్రబాబు సీలేరు కరెంట్

ఇవ్వలేదన్నారు. కృష్ణ పట్నంలో తెలంగాణ జెన్‌కో, తెలంగాణ డిస్కంలు రూ. 1050 కోట్ల పెట్టుబడి పెట్టాయని, 54 శాతం వాటా తెలంగాణకు రావాలన్నారు. అయినా ఆ కరెంట్ తమకు ఇవ్వడం లేదని, పైగా హిందుజా కరెంట్ కూడా రాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కరెంట్ రాకుండా ఇన్ని కుట్రలు చేయడం వల్లే తెలంగాణలో విద్యుత్ కొరత ఏర్పడిందని, కొరతను అధిగమించేందుకు, పంటలు కాపాడుకునేందుకు శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేయడం అనివార్యమయిందని వెల్లడించారు. శ్రీశైలంలో కావాల్సినంత నీరు అందుబాటులో వుందని, దాని ప్రకారమే తాము జల విద్యుత్ ఉత్పత్తి చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. 857 అడుగుల మేర నీరున్నప్పటికి శ్రీశైలంలో జలాలు అడుగంటుతున్నాయని అబద్దపు ప్రచారాలు కూడా చేశారని సిఎం వివరించారు. జిఓ నెంబర్ 69, జిఓ నెంబర్ 107, జిఓ నెంబర్ 233 లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పండిట్‌కు వివరించారు. జిఓల ప్రకారం 834 అడుగుల వరకు నీటిని వాడుకోవచ్చని ఉందన్నారు. ఇన్ని జిఓలు ఉన్నప్పటికి గతంలో చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉన్న 9 ఏళ్ల కాలంలో ఏనాడు నిబంధనలు పట్టించుకోలేదని, ఏ ఒక్క ఏడాది కూడా 834 అడుగులను మేయింటేన్ చేయలేదని లెక్కలు, ఆధారాలతో సహా ముఖ్యమంత్రి వివరించారు. 750 అడుగుల వరకు నీటిని వాడుకున్న విషయాన్ని బోర్డు చైర్మన్ దృష్టికి తెచ్చారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అప్పటి అవసరాల మేరకు ఎంత నీటినైనా విడుదల చేసుకున్నారని, తాము ఇప్పుడు నిబంధనల మేరకే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా గగ్గోలు పెడుతున్నారని కేసిఆర్ వివరించారు. కృష్ణా నది జలాల దోపిడి విషయంలో కూడా బోర్డు ఖచ్చితంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. మొదటి నుండి కృష్ణా నది జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదని వెల్లడించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు అసలు పేరు నందికొండ ప్రాజెక్టు అని, ఇప్పుడున్న నాగార్జునసాగర్ కన్నా 19 కిలోమీటర్ల ఎగువన ప్రాజెక్టు నిర్మించడానికి మొదట ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఆ తరువాత సమైక్య రాష్ట్రంలో నీటి కేటాయింపులను మార్చి, ప్రాజెక్టు డిజైన్ మార్చి తెలంగాణకు అన్యాయం చేశారన్నారు. మొదట తెలంగాణకు 160 టిఎంసిలు, ఆంధ్రకు 80 టిఎంసిలు అనుకుంటే చివరికి వచ్చే సరికి తెలంగాణకు 25 టిఎంసిలు కూడా దక్కే అవకాశం లేకుండా చేశారన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ

నిర్మాణం మొదట ఇల్లందు, గార్లదాకా చేయాలని నిర్ణయించుకున్నప్పటికి చివరికి ఆ కాలువ పాలేరు రిజర్వాయరు వద్దకే చేరిందన్నారు. అక్కడి నుండి మళ్లీ కృష్ణా నీరును ఆంధ్రకే తరలించడానికి కుట్ర చేశారని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి కూడా ఆంధ్ర ప్రభుత్వం అక్రమంగా నీటిని వాడుకుంటున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. తెలుగు గంగ ద్వారా 15 టిఎంసిలు, శ్రీశైలం కుడి కాలువ ద్వారా 19 టిఎంసిలు మాత్రమే వాడుకునే హక్కు ఉన్నప్పటికి దాదాపు 338 టిఎంసిల నీటిని వాడుకోవడానికి అనువైన రిజర్వాయర్లు నిర్మించుకున్నారని, పోతిరెడ్డిపాడు ద్వారా జల దోపిడి యదేచ్ఛగా సాగుతున్నదన్నారు. తెలంగాణలో జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బిసి, ఆర్‌డిఎస్ లాంటి ప్రాజెక్టులు పూర్తి కాలేదని, అదే ఆంధ్రలో మాత్రం ఏలాంటి అనుమతులు లేకున్నా, నీటి కేటాయింపులు లేకున్నా ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్ల కృష్ణా నీటిలో తెలంగాణకు ఉన్న వాటాను వినియోగించుకోలేక పోతున్నామని వెల్లడించారు. అసలు కృష్ణా నదిలో తెలంగాణ ప్రాంతానికి కేటాయింపుల్లో కూడా అన్యాయమే జరిగిందని, బచావత్ ట్రిబ్యూనల్‌లో తెలంగాణ వాదనలు వినిపించే అవకాశం రాలేదని ముఖ్యమంత్రి చెప్పారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు ఆంధ్ర, రాయలసీమకు నీళ్లను తరలించుకుపోయేందుకు ప్రయత్నించారు తప్ప తెలంగాణ అవసరాలు గుర్తించలేదన్నారు. అందుకే తెలంగాణకు ఇప్పుడైనా న్యాయం జరగాలని అభ్యర్థించారు. ఈ నెల 29న కృష్ణా రివర్ బోర్డు సమావేశం జరుగుతున్నందున తెలంగాణకు జరిగిన అన్యాయంపై సవివరంగా చర్చించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం తరపున బోర్డు సమావేశానికి సాగునీటి రంగ నిపుణులు ఆర్.విద్యాసాగర్ రావు హాజరవుతారని చెప్పారు. నాగార్జునసాగర్ పూర్తి స్థాయిలో నీటి పారుదల ప్రాజెక్టు అయితే శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు అని దీనికి అనుగుణంగా నీటి వాడకం విషయంలో ఖచ్చితమైన ఆపరేషన్ రూల్స్ రూపొందించాలని కోరారు. శ్రీశైలంలో నీటిని వాడుకునే హక్కు, జల విద్యుత్ చేసుకునే హక్కు తెలంగాణకు ఉందని, ఈ హక్కును కాపాడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియమాకాలు అనే ట్యాగ్‌లైన్‌తో నడిచిందని అలాంటిది నీటి విషయంలో తాము రాజీపడే ప్రశ్నేలేదన్నారు. శ్రీశైలం నీటి వాడకం విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న వాదనలన్నీ తప్పని, ఇదే

చంద్రబాబు నాయుడు అధికారంలొ ఉన్నప్పుడు 2002 లో హైకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌లో నీటి వాడకం విషయంలో ప్రభుత్వానికి పూర్తి హక్కు ఉంటుందని చెప్పిన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి పండిట్ దృష్టికి తెచ్చారు. ఎన్ని జిఓలు ఉన్నా గత ప్రభుత్వాలు చాలా తక్కువ అడుగుల వరకు నీటిని తరలించిన ఉదంతాలను ముఖ్యమంత్రి రికార్డులతో సహా పండిట్‌కు అందించారు. కేసిఆర్ వాదనను, అభిప్రాయాలను, అభ్యర్థనలను పండిట్ సావధానంగా విన్నారు. తప్పక బోర్డు సమావేశంలో చర్చిస్తామని హామి ఇచ్చారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం